తైక్వాండో పోటీలో గమన్‌రెడ్డికి సిల్వర్ మెడల్

నేరేడుచర్ల : మండల కేంద్రానికి చెందిన కొణతం గమన్‌రెడ్డి చన్‌హంగ్ ఇంటర్నేషనల్ తైక్వాండో ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏపీలో నిర్వహించిన మొదటి జాతీయ తైక్వాండో పోటీలో పాల్గొని సిల్వర్ మెడల్‌ను గెలుచుకున్నారు. గమన్‌రెడ్డి 20కి లో విభాగంలో ఈ మెడల్‌ను సాధించినట్లు, జనవరి 8,9,10వ తేదీల్లో నేపాల్‌లో జరిగే పోటీలకు అర్హత సాధించినట్లు కోచ్ సుబ్బారావు ఆదివారం తెలిపారు.



అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

- కోదాడ ఎమ్మెల్యే ఎన్.పద్మావతి

మునగాల : మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే ఎస్.పద్మావతి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఎలక బిందు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఎంపీపీ ఎలక బిందు, జెడ్పీటీసీ నల్లపాటి ప్రమీల, వైస్‌ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. అనంతరం మండలంలోని ఆయా శాఖలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ ఆంజనేయులు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీపీ ఎలక బిందు, జెడ్పీటీసీ నల్లపాటి ప్రమీల, వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు పాల్గొన్నారు.

ఎంపీఓపై చర్య తీసుకోవాలి

ఎంపీఓ మండలంలోని పలువురు సర్పంచ్‌లను వేధిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని మునగాల సర్పంచ్ చింతకాయల ఉపేందర్ ఆరోపణలు చేశారు. గ్రామపంచాయతీల్లో తాము చేసిన పనులకు బిల్లులు చేసే విషయంలో ఎంపీఓ భూపాల్‌రెడ్డి లంచం డిమాండ్ చేస్తున్నారని, తక్షణమే బదిలీ చేయాలని ఎమ్మెల్యే పద్మావతి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఫిర్యాదు చేస్తే పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.


మునగాల : సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నలమాద పద్మావతి


మోతె : ఎమ్మెల్యే పద్మావతికి కేక్ తినిపిస్తున్న ఎంపీపీ ఆశ తదితరులు

త్వరలో జర్నలిస్టులకు ఇళ్లస్థలాల పంపిణీ

నియోజకవర్గంలో అర్హులైన జర్నలిస్టులకు త్వరలో ఇళ్లస్థలాలు పంపిణీ చేపడతామని ఎమ్మెల్యే ఎస్.పద్మావతి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి హాజరైన ఆమెకు స్థానిక జర్నలిస్టులు ఇళ్లస్థలాలు పంపిణీ చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే వీలైనంత త్వరలో కోదాడ ఆర్డీఓతో సంప్రదించి ఇళ్ల స్థలాలు పంపిణీ చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం మండల విలేకరులు ఎమ్మెల్యేను పూలమాల, శాలువాతో సన్మానించారు.

మండలానికి పాలేరు జలాలు అందిస్తా

మోతె : మండలానికి పాలేరు జలాలు లిఫ్టుల ద్వారా అందిస్తానని ఎమ్మెల్యే ఎన్. పద్మావతి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎంపీపీ ముప్పాని ఆశ శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మండలంలో సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించే మార్గంలో ముందుకుసాగాలన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి నిజాయితీతో పనిచేయాలని, అధికారులు వసూళ్లకు పాల్పడుతున్నారని తెలిస్తే ఎవరిని వదిలే ప్రసక్తే లేదన్నారు. పలువురు సర్పంచ్‌లు గ్రామాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పందిళ్లపల్లి పుల్లారావు, ఎంపీడీఓ హరిసింగ్‌నాయక్, తహసీల్దార్ ప్రకాష్‌రావు, సూపరింటెండెంట్ వెంకటాచారి, ఎంఈఓ గోపాల్‌రావు, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

అనంతగిరి : మండలంలోని ఖానాపురంలో కాటమయ్య ఆలయంలో ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ఆదివారం పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ చుండూరి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ కొణతం ఉమా, పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి, గునుకుల గోపాల్‌రెడ్డి, బాణోతు బాబునాయక్, తదితరులు పాల్గొన్నారు.



పెండింగ్ పనులు వెంటనే పూర్తిచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పార్వతి

మఠంపల్లి : మండలంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు ప్రత్యేక చొరవచూపి వెంటనే పూర్తిచేయాలని ఎంపీపీ పార్వతీకొండానాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో పలువురు కాంగ్రెస్ ఎంపీటీసీలు నేలపై బైఠాయించి ఆదాయ వ్యయాలపై గతంలోనే సమాచార హక్కు చట్టం ప్రకారం కోరినా వివరాలు అందజేయలేదని, నిధులు కేటాయించడంలో వివక్షచూపారని నిరసన వ్యక్తం చేశారు. ప్రజాపాలన అనంతరం 7వతేదీన వివరాలు లిఖిత పూర్వకంగా అందజేస్తామని ఎంపీడీఓ జానకిరాములు తెలపడంతో నిరసన విరమించారు. సమావేశంలో జెడ్పీటీసీ జగన్‌నాయక్, ఎంపీడీఓ జానకిరాములు, ఎంఈఓ చత్రునాయక్, ఎంపీఓ ఆంజనేయులు, ఏపీఓ ఉమాదేవి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మూసీనదిపై లిఫ్ట్ ఏర్పాటుకు అనుమతి


లిఫ్ట్ నిర్మాణానికి స్థలం పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పాలకవీడు : మండలంలోని బెట్టెతండా వద్ద మూసీనదిపై సాగునీటి అవసరాల కోసం లిఫ్ట్ ఏర్పాటుకు నీటి పారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అనుమతులు ఇచ్చినట్లు జెడ్పీటీసీ మాళోతు బుజ్జిమోతీలాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె జిల్లా నీటిపారుదలశాఖ అధికారులు సీఈ రమేష్‌బాబు, ఎస్ఈ నరసింహారావు, ఈఈ శ్రీనివాస్‌తో కలిసి మూసీనది వద్ద లిఫ్ట్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. సాగర్ ఆయకట్టుకు చివరి ప్రాంతం కావడంతో సాగునీరందక రైతులు నష్టపోతున్నారని, లిఫ్ట్ ఏర్పాటుతో సుమారు 2వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. 2సంవత్సరాల క్రితం ఈ ప్రాంతంలో లిఫ్ట్ ఏర్పాటుకు అనుమతులు వచ్చినా ప్రభుత్వం సహకరించక నిలిచిపోయాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సమస్యను విన్నవించడంతో అంచనా వ్యయం, నిర్మాణ స్థలాన్ని పరిశీలించి ప్రతిపాదనలు తయారు చేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారని అన్నారు. దీంతో పరిశీలించిన అధికారులు పంప్‌హౌస్, విద్యుత్, పైప్‌లైన్, డెలివరీ పాయింట్లకు రూ.36కోట్లు అంచనా వ్యయం కానున్నట్లు, ఈ మేరకు పూర్తిస్థాయి నివేదికను మంత్రికి అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే మండలంలో మూసీఒడ్డుసింగారం సమీపంలో మరో లిఫ్ట్ మంజూరు చేయాలని మంత్రిని కోరనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో బెట్టెతండా గ్రామస్తులు హతిరాం, నగేష్, వినోద్, శ్రీను, రమణ, కిషన్, కృష్ణ పాల్గొన్నారు.

వాసవీ, వనితా క్లబ్‌లకు ఇంటర్నేషనల్ అవార్డు

నేరేడుచర్ల : నేరేడుచర్ల వాసవీ, వనితా క్లబ్‌లకు డిస్ట్రిక్ ఏలో ఇంటర్నేషనల్ అవార్డు వరించింది. ఈ అవార్డును ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో జరిగిన కార్యక్రమంలో వనితా క్లబ్ అధ్యక్షురాలు వీరవల్లి శ్రీలతాకోటేశ్వర్‌రావు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్, వనితా క్లబ్ ప్రధాన కార్యదర్శి పోలిశెట్టి సంధ్యలు, వాసవీ, వనితా క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాలకూర్తి గాయత్రి, ఇరుకుల రామకృష్ణ చేతుల మీదుగా ఆదివారం అందుకున్నారు. అదే విధంగా వాసవీ క్లబ్ వైస్ గవర్నర్‌గా పని చేస్తున్న రాచకొండ విజయలక్ష్మికి 2023సంవత్సరానికిగాను ఇంటర్నేషనల్ బెస్ట్ క్యాబినేట్ ట్రెజరరీ అవార్డును అందుకున్నట్లు ఆమె వెల్లడించారు.

చెరువుమట్టి తరలిస్తున్న జేసీబీలు, ట్రాక్టర్ల సీజ్

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లి ఊరచెరువు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు జేసీబీలు, మూడు ట్రాక్టర్లను శనివారం రాత్రి పట్టుకుని సీజ్ చేసి ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సీహెచ్ బాలకృష్ణ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. రాత్రి వేళల్లో కొంతమంది జేసీబీలు, ట్రాక్టర్లతో అక్రమంగా చెరువుమట్టిని తరలిస్తున్నారనే సమాచారంతో నీటిపారుదల శాఖ ఏఈ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విగ్రహాలను ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు

అనంతగిరి : మద్యం మత్తులో జాతీయ నాయకుల విగ్రహాలను ధ్వంస చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనిల్‌రెడ్డి ఆదివారం తెలిపారు. మండలంలోని వాయిలసింగారంలో శనివారం జరిగిన ఓ పెళ్లి ఊరేగింపులో అదే గ్రామానికి చెందిన పలువురు యువకులు అతిగా మద్యం తాగి గ్రామపంచాయతీ వద్ద ఉన్న మహాత్మాగాంధీ, బాబు జగ్జీవన్ రామ్, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను ధ్వంసం చేశారు. దీంతో గ్రామ కార్యదర్శి ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన బొడ్డు వంశీ, తోళ్ల శ్యామ్, కొత్తపల్లి వేణు, జల్లు మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

హుజూర్‌నగర్‌రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తుందని దక్షిణ మధ్య రైల్వే జోనల్ మెంబర్ యరగాని నాగన్న గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని బూరుగడ్డలో గల శంభులింగేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే దారిలో సీసీరోడ్డు పనులను సర్పంచ్ షేక్ సలీమారంజాన్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చిమట సైదులు, ఉపసర్పంచ్ శీలం ఆదెమ్మ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ వెంకటేశ్వర్లు, భిక్షం, నాగయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీ పరిధిలోని మాధవరాయినిగూడెంలో బీఆర్‌ఎస్, టీడీపీ, బీఎస్పీల నుంచి సుమారు 60కుటుంబాల వారు కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు మోదాల సైదులు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు నందిగామ శ్రీనివాస్, మోదాల వెంకన్న, మేకల సైదులు, గడ్డం అంజయ్య, ఆవుల వీరేష్, రౌతు చప్పిడి సావిత్రి, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తోన్న కేంద్రం


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కోదాడ అర్బన్: కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులకు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన ఆ సంఘం జిల్లా స్థాయి సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు, పాలకులు మారినా కార్మికుల బతుకులు మారకపోవడం దారుణమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వల్ల కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెబుతామన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, గౌరవ సలహాదారులు అశోక్‌పోతురాజు, సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు లతీఫ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గుగులోతు రాజారాం, నాయకులు రాఘవరెడ్డి, నిమ్మల ప్రభాకర్, నాగరాజు, జెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.















